భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

7, నవంబర్ 2026, శనివారం భారత్ సమాచార్

విష్ణు పాఠశాలలో పర్యావరణహిత దీపావళి సంబరాలు





భారత్ సమాచార్, మెదక్ జిల్లా: సంప్రదాయ పద్ధతులకు ప్రాధాన్యతనిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని జీవీఆర్ఐటీ ప్రాంగణంలో ఉన్న విష్ణు ఉన్నత పాఠశాలలో శనివారం పర్యావరణహిత దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వినూత్న కార్యక్రమాలతో పండుగ సంబరాలను పంచుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి దీపావళి పండుగ విశిష్టత, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు పండుగ ప్రత్యేకతను తెలియజేస్తూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. కాలుష్యానికి కారణమయ్యే బాణాసంచాకు దూరంగా ఉంటూ పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా దీపావళి జరుపుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు.

అనంతరం విద్యార్థులు సహజ రంగులను ఉపయోగించి అందమైన ముగ్గులు వేసి తమ ప్రతిభను చాటుకున్నారు. మరికొందరు పిండి, మట్టితో సంప్రదాయ ప్రమిదలను తయారు చేసి ఆకట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ ఆకృతులను రూపొందించి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. సంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ పర్యావరణ స్పృహను పెంపొందించేలా నిర్వహించిన ఈ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, జనరల్ మేనేజర్ బాపిరాజు, పరిపాలన అధికారి సురేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని దీపావళి ఆనందాలను పంచుకున్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది.

© 2026 Bharath Samachar